# ప్రారబ్ధోత్సవం

పల్లెలనుంచి పట్నాలకు

భాగ్యవంతులమైపోదామని కొందరొస్తే.. బతుకు గడుస్తుందేమో అనే ఆశతో ఎందరో వస్తారు. అలాంటి 'ఎందరో' లో – 'ఎ' బార్బర్ దుర్గారావు. అతను పుట్టిందీ, పెరిగిందీ పల్లెలోనే. ఏడో తరగతి వరకూ చదువుకున్నాడు. అప్పటికతనికి వద్నాలుగు నిండాయి. అప్పుడే అతనికి తండ్రి హితభోధ చేశాడు. "చూడు కొడకా! నోట్లో ఎన్నచ్చరాలున్నా అవి కడుపులో ఆకలిని తీర్చవు. చేతిలోని వనే పొట్ట నింపుతుంది. కులవృత్తికి సాటిరావు గువ్వలచెన్నా.. అని ఊరికే అనలేదు. ఆపైన నీ యిష్టం."

దుర్గారావు చదువు పెద్దల నెదిరించేది కాని కులవృత్తిని కించపరుచుకునేది కాని కాకపోవడంతో వెంటనే చదువుకి సలాం కొట్టి తండ్రి శిక్షణలోనే వృత్తి చేపట్టాడు. పని బాగానే అలవడింది. రోజులు బాగానే వెళ్ళసాగాయి. ఒక తెలుగు పండితుడికి దినం విడచి దినం గెడ్డాం గీస్తూ ఆయన మాటలు వింటూండడం వల్ల పాండిత్యమే అనిపించేంత తెలుగు భాష అంటింది. అలాగే వయసు వల్ల పెళ్ళి.. పెళ్ళి.. వలన పెండ్లామూ, ఆమెవలన బిడ్డలూ కూడ అంటారతనికి. అప్పటినుంచి సమస్యలూ అంటసాగాయి. తండ్రి చనిపోయాడు. పల్లెలో క్షురవృత్తికి గౌరవంతో పాటే ఆదాయం కూడా పడిపోయింది. ఫ్యాషన్‌పేరిట పల్లెల యువకులు పట్నం వెళ్ళి 'కటింగ్' చేయించుకుసాగారు. సంసార భారం పెరిగి ఆదాయం తగ్గూతూండడంతో యిక అక్కడ బతుకు గడవడం కష్టమైపోయింది. తన నైపుణ్యం మీద విశ్వాసాన్ని, ఆశనీ, ధైర్యాన్నీ, అప్పు తెచ్చిన కొంత డబ్బునీ పట్టుకొని పట్నమొచ్చాడు. అతనికి పట్నం పోకడలు కొన్ని తెలుసు

బ్రోతల్‌హవుసుకి తప్ప మరి దేనికైనా బోర్డు లేనిదే బిజినెస్సు ఉండదని – తను పెట్టబోయే షాపుకి బోర్డు రాయిద్దామని సదరు కళా ప్రవీణుడి వద్దకు వెళ్ళాడు. అతగాడికేమో వినూత్న ప్రయోగాలు చేయడం విపరీతమైన సరదా. దుర్గారావ్ మంచితనాన్ని గ్రహించి అమాయకపు నిర్మాత దొరికిన అవార్డు సినిమా దర్శకుడిలా ఆనందించి, ప్రయోగాలు చేయడమనే తన సరదాను తీర్చుకునేందుకు సువర్ణావకాశం లభించిందన్న నంబరంలో విజృంభించేసాడు.

"నీ షాపు పేరు నేను పెడతాను. బోర్డు నేను డిజైన్ చేస్తాను. సగం రేటుకే పూర్తి పని ' ఇచ్చట మీ తల అందంగా కోయబడును' ఆర్టిస్టిక్ అక్షరాలతో. వీటి కింద కటింగ్ చేయించుకుంటున్న కళ్యాణ్, పవన్‌కళ్యాణ్. బస్ నీ షాపు సూపరు దూపరు హిట్టే ఓపెనింగదిరిపోద్ది. శతదినోత్సవం మినిమమ్ గ్యారంటీ." వంద రూపాయలు లాగేసుకున్నాడు. మందు అతన్నే కొట్ట సాగాక.. నీ పేరు.. నీ షాపుపేరు.. బరబరా" చెప్పేసాడు.

'బర్‌బరా!, అదేం పేరు ? గొర్‌గొరా' అని పేరు పెట్టినా కొంత అర్థముంటుంది తల

గొరుగుతాను కనుక" అని నోరు విప్పాడు దుర్గారావ్. ప్రస్తుత ప్రపంచ పరిస్థితి మీద ఉపన్యాసానికి లంకించుకోడానికి ఆర్టిస్టుకి అవకాశం వచ్చేసింది. " రోజులెలా ఉన్నాయి. పబ్లిక్ పల్స్ ఎలా ఉంది. కంఠం బాగుండని వాడికే డిమాండ్. పందుల్ని పొడిచే వాడిలా వుంటేనే హీరో రోల్. అలాగే పేరు గమ్మత్తుగా అర్థం లేకుండా ఉంటేనే మోడ్రనూ, పాపులరూ."

సరే రోట్లో తలదూర్చాక రోకటిపోటుకి వెరవడమెందుకలే అని ఆర్టిస్టుకొక దణ్ణం పెట్టేసి వెనుదిరిగేసరికి "ఆగు ! అని ఆరుసార్లు గద్దింపులు - ఆరు గొంతులతో. వాళ్ళారుగురూ గుండాల్లాగో, ముదురు రాజకీయనాయకుల్లాగో, సినిమా హీరోల్లాగో క్రూరంగా ఉన్నారు. తప్ప మామూలు మనుషుల్లా లేరు. వీళ్లారుగురి జుత్తులు కూడా కత్తులకో, కఠారులకో తప్ప కత్తిరికి లొంగేటట్లెంత మాత్రమూలేవు. వాళ్ళకి తనతో పనేమిటా అని తెల్లమొహం వేసి చూశాడు. దుర్గారావ్.

" నువ్వు - హెయిర్‌కటింగ్ సెలూన్ పెట్టాలనుకుంటున్నావా ?" ఆరుగురిలో ఒకడడిగాడు. "ఔను." అన్నాడు. అతను నేరమేమిటో తెలియకుండానే ఒప్పేసుకుంటున్న ట్లు. "నీషాపుకి ప్రారంభోత్సవం ఎవరిచేత చేయించబోతున్నావ్" అకారం భీకరమే కాని కంఠం చుంచెలకలా కీచుమంది.

ఆ ప్రశ్నకే ఆశ్చర్యపడిపోయి "నాది - హెయిర్ కటింగ్‌సెలూన్ కాదండి. చిన్నబడ్డీ. దానికోపెనింగూ క్లోజింగు ఉత్సవం కూడానా! " నవ్వేశాడు. 'అలా వీల్లేదు. చిన్నదయినా పెద్దదయినా షాపుషాపే. దానికి ప్రారంభోత్సవం ఉండి తీరాల్సిందే. బొంగురు గొంతుతో చెప్పాడు. నంబర్ త్రి.

"అది మా మంత్రిగారే చెయ్యాల్సిందే". నంబర్‌ఫోర్ శాసించాడు.

"తమ లాటివారు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్లు నాలాటోడి మీద జోకు వెయ్యకూడదండి పరువుపోద్ది. మంగలిషాపుకి మంత్రిగారు ప్రారంభోత్సవం చేత్తారంటే నమ్మేసేంత అమాయకుణ్ణి కాదు."

"అమాయకుడివో, మాయకుడివో మాకనవసరం. మా మంత్రి గారొచ్చి నీ షాపు తెరిచే వరకూ నువ్వేమీ చెయ్యకూడదు. కబడ్దార్ " అన్నట్లు బెదిరించాడు నంబర్‌ఫైవ్. మంత్రీ మంగలీ యిద్దరికిద్దరూ ప్రజలకు చేసేది తిరుక్షవరమే కనుక వారిద్దరినీ ఒక రాటకి కట్టినా అవమానమూ అన్యాయమూ జరిగిపో వు. కాని. రాజధాని కాక ఒక మామూలు పట్నంలో ..అతి మామూలు షాపు తాడు తెంపడానికి మంత్రి గారొచ్చారంటే మాత్రం రాజకీయ మంత్రులకు పన్లేదనుకోవలివొస్తుంది.

అంతట మళ్లీ ఆ గూండాలు "జ్ఞాపకముం ది కదా మేం చెప్పింది.? మా మంత్రి గారిని కాదని షాపు తెరిచావో నీకీవూళ్లో నీళ్ళుండవు."

" బాబూ కత్తెరాడితే కానీ కడుపు నిండని బతుకు." ఏదో చెప్పుకోబోయాడు. వాళ్లు అతని మొర వినిపించుకోలేదు. దుర్గారావుకి కోపం వచ్చింది. పేదవాని కోపం పెదవికి చేటని మరిచిపోయాడు. తన షాపుని తానే తెరుచుకోవాలనే తన కోరికను కాదనడానికీ, అడ్డుపడడానికీ ఈ రాజకీయ సైంధవులకు

హక్కెక్కడ వుంది? భారత రాజ్యాంగంలో ఎన్నో స్వాతంత్ర్యాలూ, ప్రాధమిక హక్కులూ పౌరులకు ఉన్నాయంటారే మరి తను అప్పు చేసి కష్టపడి కట్టుకున్న బడ్డీని తన చేతులారా ప్రారంభించుకునే హక్కు లేదా. ఏ ప్లీడరునో అడిగితే చెబుతాడు కాని వద్దు ఇప్పటికే తిరుగుడు కుర్చీకీ,అద్దాలకూ వాటికీ తడిసి మోపిడయింది. ఆ దుష్టులు తనని వినిపించుకునే స్థితిలో లేరు. (సినీ) స్టారునీ, (మిని) స్టరునీ ఆహ్వానించే వారింకొకరి మాట వినరు కదా ? పిలిచేవారికి బుద్ధి లేకపోతే వచ్చేవారికైనా ఉండొచ్చుగా ? నలుగురూ నవ్వుతారని మంత్రిగారే రాకుండా ఉంటారేమో? అనే ఆశతో తన బడ్డీ పనులు చూ(చే)సుకోగాడు.

కానీ..చోటా రాజకీయ నాయకులు వెళ్ళి ఆహ్వానించేసరికి మంత్రిగారు మూడు రోజులై దండకావరం (మెడలో దండ పడక కలిగే బాధ) తో సఫరవుతున్నారు. ఒక్కతాడూ తెంపక వేళ్ళు తిమ్మిర్లు ఎక్కిపోతున్నాయి. ఒక్క స్పీచీ లేక నాలిక వాచిపోతూంది. వేదికెక్కక కాళ్లు గుదులు పట్టేశాయి. ఆ ఉదయమే ఆపదల మొక్కువాడికి మొక్కుకున్నాడు. తన కష్టం గట్టెక్కిస్తే కొండకొస్తానని, మొక్కుకున్నాకే టిఫిన్ మెక్కారు. నేనున్నానంటూ దేముడు ప్రారంభోత్సవా దృష్టాన్ని ప్రసాదించాడు.

అవురావురు మంటూ గోడమీంచి పడే పులి విస్తరాకు కిందపడే వరకు కూడా ఆగలేక మధ్యలోనే అందుకున్న ఆకలి ముష్టాడిలా ప్రారంభోత్సవ సమయంకంటే తనే ముందు వచ్చేసాడు మంత్రి. అమాత్యుల వారి ఆగమనం అంటే ఊరంతా అస్తవ్యస్తం కదా. రోడ్ల ప్రక్క బళ్ళ బతుకుల వాళ్ళకి, ముష్టి వాళ్ళకీ ఆవేళ పస్తే కదా ? రోడ్లనిండా పోలీసులూ, పొలిటికల్ పీపులూ , ట్రాఫిక్‌కి పక్కదారులూ. బర్‌బరా షాపు ముందరి రోడ్డు మంత్రిగారూ.. వారి పార్టీవారు..వారూ, వారి గ్రూపువారూ.. మనిషికొక పలావ్ ప్యాకెట్ ఆశ చూపి ఎమ్మెల్యే తరలించుకు వొచ్చిన వారితో ఆ రోడ్డు బందయింది. ఇతరులకు ఆ రోడ్డుని తాత్కాలికంగా మూసేశారు. ఊళ్ళోపెళ్ళీ - కుక్కలకి హడావిడీ, గాడిద గానానికి ఒంటి నాట్యం అన్నట్లు మంత్రిగారి రాకకు మహా హడావిడి చేస్తున్నాయి, ఎర్రబుట్టలూ, కాకీ బట్టలూ.

ఈ సందడిలో దూరంగా తోసివేయబడ్డ దుర్గారావ్ మతిపోయి, చేష్టలుడిగి, నిశ్చేష్ట ప్రేక్షకుడిగా చూడసాగాడు. అతనికి కోపంగా ఉందీ తతంగం. చాకలి పెళ్లానికి మంగలి విడాకులివ్వడమంటే యిదేనేమో. బడ్డీ యజమాని తను. తను అడక్కుండానే వచ్చేసాడు మంత్రి తగుదునమ్మా అంటూ. అసలు మంత్రికీ యిలాంటి ప్రారంభోత్సవాలకీ సంబంధమేమిటి? రేపీ మంత్రులు మరీ పేట్రేగిపోయి ప్రారంభోత్సవ హక్కుల మీద పేటెంటు కొట్టేసి - శోభనాలకి కూడా తయారైపోవచ్చుననే ప్రమాదాన్ని ప్రజలెందుకు పసికట్టరో? సొమ్మొకడిది - సోకొకడిది. చీమలు పెట్టిన పుట్టలు పాములుకిరవవడం అంటే యిది కాక యింకేమిటి. రాజ్యం వీర భోజ్యం అన్నారు కాని, ప్రారంభం మంత్రి భోజ్యం అనలేదే. ఈ ప్రజలు గొర్రెలే. ఎంతసేపూ ప్రారంభోత్సవం చేసే మంత్రి గురించే తప్ప యీ బడ్డీ నిర్మాణానికి అప్పులూ, చెమటా ఓడ్చిన కూలీ ఎవ్వడని ఆలోచించరేం

? కూల్ డ్రింక్ దుర్గారావ్‌కి రాలేదు. కనుక అతని క్రోధం కొంచెమైనా చల్లారలేదు.

కార్యక్రమం పీలిక పుటుక్కు (మంత్రి గారు తెలుగు ప్రియులు ఎందుకంటే ఆ బాసొక్కటే ఆయనకర్థమౌతుంది. అంచేత రిబ్బన్ కటింగ్ అనే ఆంగ్ల పదం అనందర్భమే ఔతుంది) దగ్గరకొచ్చింది. ఎవరో వెండి కత్తెరందించారు. మళ్లీ దుర్గారావ్‌లో సందేహం లాంటి వొళ్ళు మంట. ప్రారంభోత్సవం.. రిబ్బన్ కటింగనగానే వెండి కత్తెరలే ఎందుకు తయారవుతాయి? నిజానికవి బాగా తెగనే తెగవు. కనీసం మంగలి షాపుల ప్రారంభానికైనా మంత్రులు ఇనుపకత్తె రలు వాడడం న్యాయంగా ఉంటుంది.

ఆ కోత ఐపోయాక ఆ వెండి కత్తెరని షాపు యజమానయిన తనకివ్వక మంత్రిగారే జేబులో వేసేసుకోవడం దుర్గారావ్‌ని మనసులో మరో కనకదుర్గనే చేసి వొదిలింది.

వారి కార్యకర్తలూ ఎమ్మెల్యేలూ.. దండలతోనూ.. పొగడ్తలతోనూ ముంచేత్తేస్తారు. మంత్రిగారూ మహోత్సాహంగానూ, మహోద్రేకం గానూ. (సెక్రటరీ రాసిచ్చిన) మాటలాడడం మొదలుపెట్టారు. మైకుని రేప్‌చేస్తున్నట్లే. మై రావణుడై తన ముందుకి లాక్కుని అది ఆర్తనాదం చేసినా కేర్ చెయ్యకుండానూ, కాళిదాసు కవిత్వం కొంత, నా పైత్యం మరికొంత అన్నట్లు తన మాటలు కూడా జోడించి ఉపన్యసించసాగారు "నా ఆశేషాభిమానులారా! మాతృ, పితృ, అత్త, మామ, సోదర, సోదరీ, పిల్లల మణులారా! మీ అందరికి నా వందేసి వందనాలు. ఈ బర్ బరా బార్బర్ షాపుని నేను ప్రారంభించుచున్న నేడు భారతదేశ చరిత్రలోనే ఒక గొప్ప సుదినము.." పెయిడ్ చప్పట్లు. పీలిక తెంపరి (రిబ్బన్ కటర్)లో ఉత్సాహం "స్వాతంత్ర్య సమరయోధు లూ, ప్రఖ్యాత కవీ అయిన గురజాడఅప్పా రావ్‌గారు స్త్రీ అంటే పిడికెడు జుత్తూ కడివెడు కన్నీళ్లూ అన్నారు." దుర్గారావ్ హాహాకారం.

"కాని.. కాలము మారెను. నేటి మన యువతీ,యువకులు ఫ్యాషన్ పేరిట, జుత్తూ, గిరజాలూ పెంచుకొనుచున్నారు. ఇది మన సాంప్రదాయమెంతమాత్రము కాదని తెలుపు టకు ఎంతో సంతోషించుచున్నాను. పెరిగిన జుత్తునెప్పటికప్పుడు కోయించుచూ నూనె, కుంకుడు కాయల ఖర్చుని ఆదా చేసి జాతీయ సంపదను పెంచనూవచ్చును. క్షురకులకు పని కల్పించి నిరుద్యోగ సమస్యను నిర్మూలించనూ వచ్చును. కనుక నిజమయిన దేశభక్తి పరాయణులు ప్రతిదినమూ క్షుర కర్మ గావించుకొనవలెను.

"జుత్తు వొత్తుగా పెరిగిపోయినచో మెదడు కు గాలి తగలక మనిషికి చికాకు, చుండ్రు మొదలయినవి కలుగును. కేశములు - క్లేశములే" ఏకబిగిన నిమిషం పాటు చప్పట్లు ఈలలు.

"మానవదేహం పాలిట వైద్యుడెటులనో మానవ కేశముల పట్ల క్షురకుడటుల. ఆహా క్షురకుడు వైద్యుడి కంటే ఎక్కువ. వైద్యుడు దుష్టాంగంబునూ, చురకుడు దుష్టకేశములనూ ఖండించు కత్తి పనివారే అయిననూ, వీరు గోళ్ల కత్తిరించుట, వొళ్లు పట్టుట, తలంటుపోయుట వంటి అదనపు పనులు కూడా చేస్తారు కదా? అందుకని వీరు బ్రాహ్మణుల కంటే కూడా అధి కులు. కనుకనే నాయీ బ్రాహ్మణులనబడుచు

న్నారు. వీరు సర్వాంతర్యాములు. రోడ్డుపక్కన.. కాలవ గట్టున చెట్టు కింద షాపులో బడ్డీలో ఏ.సి. సెలూన్‌లో.. యిళ్ళలో ఎక్కడైననూ ఎవరికయిననూ తమ సేవలందిస్తూనే ఉందురు. శుభాశుభములు రెండింటి యెడలా నాయీబ్రాహ్మణులు వేదాంతులూ, విరాగులూ, ఎలాగంటే కాలిగోళ్లు తీయుట. మంగళస్నానము చేయించుట. బ్యాండుమేళం వాయించుట మొదలగునవి వివాహ సందర్భములలో చేయుదురు. మాతాపితృలను పోగొట్టుకున్న పుత్రులకు స్మశానములో శిరోముండనము చేతురు".. పులావ్ చప్పట్లు.. "సంచార క్షవరశాలలు సరేసరి." ఒకసారి ఊపిరితీసుకొని మళ్లీ సాగించారు.

"కాలము విలువ వీరికి తెలిసినట్లు వేరొకరికి తెలియదనిన అతిశయోక్తికాదు. ఉదయమంతయూక్షుర వృత్తి చేసి మధ్యాహ్నము వీరుడోలు, సన్నాయి బ్యాండు మొదలగు వాటిపై సంగీత సాధన గావిస్తారు. రాజకుమారుల వలె దుస్తులు ధరించి వాద్యములు వాయిస్తూ వధూవరుల నూరేగించుచూ నడచు బ్యాండు మేళము ఒక వంక వీనులవిందు, మరొక ప్రక్క కనులవిందూ కదా ?"

"ఔను.."అంటూ అరుపులు... "వేయేల? సుకంసాలి, సుబ్రాహ్మణుడు అను పదములు లేవు. కాని సుమంగళి అనే పదం కలదు. ఒకప్పటి 'ళ' కాలక్రమంలో 'ల' అయింది. కనుక సుమంగళనగా మంచి మంగలని, 'ళ' 'ల' లు ఒకదాని బదులొకటి వొచ్చాయంతే. వీరు వాయించేవి. కనుకనే మంగళ వాయిద్యాలనిపించుకున్నాయి. అంతెందుకు ? బ్రాహ్మణ వారమనికాని... కోమటి వారమనికాని రాజవారమని కాని లేవు. కాని... క్షురకుల పేరిట మంగళవార మని ఉందంటే వీరి గొప్పతనం ఎంతదో ఆలోచించండి. వీరు కేశఖండనము గావించిన కాని వేంకటేశ్వరుడు భక్తునకు దర్శనమివ్వడు. అంటే ముందు క్షురకుడు, తరువాత వేంకటేశ్వరుడు అనేకదా ? కాలిలో ముల్లు గుచ్చుకున్ననూ వీరే, కళావంతులు కావాలన్ననూ వీరే.."

"కళావంతులు కారు, కళాకారులు.." అని జనం లోంచి అరవబోయారు. కాని అప్పటికే...

"....క్షురకులు నా ఆరాధ్యదైవాలు. క్షవరశాలలు నా దేవాలయాలు. మన దేశం సుభిక్షంగా ఉండాలంటే, యింటికొక క్షురకుడు వీధికొక క్షవరశాల ఉండాలని నా ఉద్ధేశ్యం. ప్రజల వద్దకు క్షవరమనే పథకం తొందరలో ప్రవేశపెడతానని యీ సభాముఖంగా వాగ్దానం చేస్తున్నాను. ఏ దేశంలో క్షురకులూ, క్షవరశాలలూ అధికంగా ఉంటాయో ఆ దేశమే నిజమయిన పురోభివృద్ధి సాధించినట్లు.." కూల్‌డ్రింక్ చప్పట్లు, పులావ్ చప్పట్లు, డబ్బుల చప్పట్లు, ఆపేయ్యమని చప్పట్లు, ఉపన్యాసం ముగించి "ఈ..నేను ప్రారంభించిన షాపుకి మొదటి బేరగాడుగా ఎమ్మెల్యే ఏడుకొండలు గారు.." అంటూ ప్రకటించారు మంత్రిగారు.

ఎమ్మెల్యే గారికి ఉపన్యాసావకాశం లేదు. అప్పుడొచ్చింది ఆ బడ్డీ యజమాని గురించి ప్రశ్న. దుర్గారావ్ షాపులోకి తీసుకురాబడ్డాడు. ఎమ్మెల్యే తిరుగుడు కుర్చీలో కూర్చున్నాడు. కెమెరాలు..వార్తా పత్రికా విలేకర్లు...

ఎమ్మేల్యేకాక ముందు ఏ వెధవ పనులు చేసి.. మళ్లీ మొలవకుండా ప్రజలచేత నెత్తి మీద జుత్తు పీకించేసుకున్నాడో కాని ఆయన బుర్ర బోర్లించిన యిత్తడి చెంబులాగే ఉంది అచ్చంగా. ఎమ్మేల్యేకి ఎక్కడ క్షవరం చేయాలో తోచక కంగారుపడిపోతూ మనసులో మాట బయటకు అనేసాడు దుర్గారావ్. "మంగలి షాపుకి మంత్రిగారి ప్రారంభోత్సవం. మరి మరుగుదొడ్డికి మీరొచ్చి తాడు కోస్తారా ?" ఎమ్మేల్యే అంగీకార సూచకంగా నవ్వునవ్వాడు. అతనేమడిగాడో తెలియకుండానే ఎమ్మేల్యేకి బట్టతలే కాక బ్రహ్మ చెముడు కూడా ఉండడం వలన దుర్గారావ్ క్షేమంగా మిగిలాడు.

(మనవి : ఈ రచనలో తప్పని సరయికులాల పేర్లు ప్రస్తావించవలిసి వచ్చినందుకు రచయిత క్షమార్హుడు.)

---

# గిన్నిబుక్కు

ఆవేళ రఘుచంద్ర యింటికి వచ్చేసరికి –

" ఇవాళ కాఫీ కప్పుకి ముందు ఒక ప్రతిపాదన ఉంచుతున్నాం మీ ముందు" అందతని భార్య.

"మీరు తప్ప మిగిలిన కుటుంబ సభ్యులంతా కలిసి ఏకగ్రీవంగా చేస్తున్న ప్రతిపాదన ఇది. తెలుగు మీడియం అనిపించుకున్నాడు పెద్ద కొడుకు. "దీనిని మీరంగీకరించి తీరాలి" శాసిస్తున్నట్లే అన్నాడు చిన్నారి. చిన్న కొడుకు కదాని చిన్నారనడంకాని, నిజానికి వాడు అతనికి పెద్ద బలవంతుడైన శత్రువు. రఘుచంద్ర శ్రీమతి సూర్యకాంతానికి – 'చిన్నారికి తన పోలికలొచ్చాయి. కనుక వాడు విపరీతమయిన తెలివైన వాడని నమ్మకం.

రఘుచంద్ర మంచివాడు. తెల్లనివన్నీ సారా అనీ, నల్లనవన్నీ సిరా అనీ నమ్మేవాడు. ప్రభుత్వం ఇద్దరు ముద్దు – ఆపైవద్దు అంటే ఇద్దరితోనే సరిపెట్టుకుందామనుకున్నాడు నిజమైన దేశ సేవకుడిలా, అక్కడికి పిల్లల్ని కనడం తన వొక్కడి డిపార్ట్‌మెంటే అన్నట్టు.

"ఠర్ ! తోటికోడలుకిద్దరు " అంది శ్రీమతి.

'మనకీ యిద్దరేగా ! నువ్వు పరాకున పడి మరిచిపోయినట్లున్నావ్..కథల్లోలా ఎంచక్కా ఓ అబ్బాయి, అమ్మాయి.."

"ఆడపిల్ల మైనస్సు. పిల్లలోకి లెక్కరాదు. తోడికోడలికిద్దరూ మగపిల్లలే. నాకూ యిద్దరూ మగపిల్లలుండకపోతే నాముందా విడ మిడిసిపడి పోదూ !" అరిచింది. మొగుడు కొట్టినందుక్కాదు తోటికోడలు నవ్వినందుకేడ్చిందట అన్న నానుడి జ్ఞాపకమొచ్చింది రఘుచంద్రకి. ఆడవాళ్ల కోరికలు పక్కింట్లోంచీ ఎదురింట్లోంచీ పుడతాయన్న మాట గుర్తుకువచ్చింది.

"అదికాదు పున్నామ నరకంనుంచి తప్పించేవాడు పుత్రుడని – పాతకాలం మాట. పుట్టినప్పటి నుంచీ తల్లితండ్రులని త్రాహిత్రాహి అనిపించేవాడు పుత్రుడని నేటి అర్థం. అదీగాక మగపిల్లడే పుడతాడని గ్యారంటీ లేదుకనుక.... ఎందరిని కంటూపోతాం ? పాలకోసం